ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 3 ఆగస్టు 2024

వైసీపీ నాయకుడికి చేనేత పింఛన్..!


S.No :2 Cluster Name :112907470
Pension ID :11200036453
Name :G Venkatesulu
UID Number:**** **** 4054
Mobile Number :9704425349
Status :NOT-MAPPED
Age :54 Caste :OC
Scheme :Weavers Amount :4000

వైసీపీ నాయకుడి పింఛన్ కార్డు

పెనుకొండ రూరల్, ఆగస్టు 2: గత వైసీపీ పాలనలో సామాజిక పింఛన్లలో అక్రమాలు అన్నీఇన్నీ కావు. వైసీపీ వర్గీయుడైతే చాలు.. పింఛన్ పంచేశారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధి 3వ వార్డులోని వెంకటరెడ్డిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, ఆ వార్డు ఇన్‌చార్జి టి. వెంకటేశులు అలియాస్ దేవుడు పింఛన్ పొందుతుండడమే ఇందుకు నిదర్శన. ఈయన వైసీపీ నాయకుడు. గతంలో వైసీపీ తరఫున డివిజన్ సభ్యుడిగా పోటీచేసి, ఓడిపోయాడు కూడా. మూడేళ్లుగా ఈయన చేనేత కార్మిక పింఛన్ పొందుతున్నాడు. విచిత్రమేమిటంటే ఈయన చేనేత కార్మికుడూ కాదు, ఏనాడూ మగ్గం కూడా నేయలేదని స్థానికులు స్పష్టం చేశారు. అయినా.. అక్రమంగా పింఛన్ తీసుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ అక్రమ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై పలువురు గ్రామస్థులు.. గ్రామ సచివాలయంలో ఫిర్యాదుచేశారు. ఆ మేరకు ఈనెల పింఛన్‌ను గ్రామ సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి భాగ్యలక్ష్మి నిలిపేశారు. అనర్హుడికి పింఛన్‌ను ఆపేస్తే రాజకీయ రంగు పులుముతున్నారు. వైసీపీ నాయకుడు వెంకటేశులుకు పింఛన్ రాకుండా టీడీపీ వారే అడ్డుపడ్డారంటూ ప్రచారం మొదలెట్టారు. పింఛన్ ఇవ్వద్దని ఓ ముఖ్య నాయకుడు.. సచివాలయ సిబ్బందికి చెప్పినట్లు శుక్రవారం వైసీపీ అనుకూల పత్రిక కథనం ప్రచురించింది. అర్హుడైనా పింఛన్ ఆపేశారంటూ ప్రచారం చేసింది. అనర్హుడు కావడంతోనే పింఛన్ ఆపేసినట్లు సచివాలయ సిబ్బంది స్పష్టం చేశారు.

కేజీబీవీ వంటమనిషి ఆత్మహత్యాయత్నం

అకౌంటెంట్ వేధింపులే కారణమని బంధువుల ఆరోపణ



నల్లమాడ, ఆగస్టు 2: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ)లో పనిచేస్తున్న వంటమనిషి లక్ష్మి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. పాఠశాలలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న మంజుల వేధింపులు భరించలేకే లక్ష్మి ఆత్మహత్యకు యత్నించినట్లు ఆమె బంధువులు ఆరోపించారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విద్యార్థినులకు భోజనం పెట్టే విషయంలో అకౌంటెంట్ మంజుల, వంటమనిషి మంజుల వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ఆమెను తోటి వంట మనుషులు నల్లమాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి కదిరి ఆస్పత్రికి తరలించారు.

డీఈఓ పరిశీలన

నల్లమాడ కేజీబీవీని జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి పరిశీలించారు. వంటమనిషి ఆత్మహత్యాయత్నం విషయం తెలియగానే.. డీఈఓ పాఠశాలకు చేరుకున్నారు. అకౌంటెంట్ మంజులను అడిగి, వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులను విచారించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు పాల్గొన్నారు. వంటమనిషి ఆత్మహత్యాయత్నంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 2: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలోని కూడళ్లు, హైవేల్లో శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, లాడ్జిల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

పసిపాపను పొట్టనబెట్టుకున్నాడు..!

చిన్నారిని చంపేసిన బంధువు

- ఇసుకలో పూడ్చివేత
- ఉన్మాదిని చితకబాదిన గ్రామస్థులు
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు
- ఎస్పీ పరిశీలన



హిందూపురం, ఆగస్టు 2: అభం.. శుభం.. తెలియని చిన్నారి పాలిట బంధువే కాలయముడయ్యాడు. సరదాగా నది వద్దకు వెళ్దొద్దామని తీసుకెళ్లి.. కర్కశంగా చంపేశాడు. ఆనక ఇసుకలో పూడ్చేశాడు. ఆ తరువాత మద్యం తాగుతూ ఉన్నాడు ఆ ఉన్మాది. మండలంలోని తూముకుంట గ్రామంలో శుక్రవారం ఎనిమిదేళ్ల చిన్నారిని ఉన్మాది గంగాధర్ హత్య చేశాడు. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు ఎనిమిదేళ్ల కుమార్తె ఉంది. తూముకుంట గ్రామంలో జాతర ఉండడంతో ఆ ఊరిలోని బంధువుల ఇంటికి ఎనిమిదేళ్ల పాప, ఆమె తల్లి వచ్చారు. అదే గ్రామంలో ఉంటున్న బంధువు గంగాధర్.. ఆ పాప పాలిట ఉన్మాదిలా మారాడు. మాయ మాటలు చెప్పి చిన్నారిని శుక్రవారం ఉదయం సమీపంలోని పెన్నానది వద్దకు తీసుకెళ్లాడు. చంపేసి, ఇసుకలో పూడ్చేశాడు. ఆ తరువాత గ్రామ సమీపానికి చేరుకుని, మద్యం తాగుతూ ఉండిపోయాడు. చిన్నారి, గంగాధర్ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు గాలించారు. గ్రామ సమీపంలో గంగాధర్ మద్యం తాగుతూ కనిపించడంతో చిన్నారి గురించి ఆరాతీశారు. ఎంత అడిగినా చెప్పకపోవడంతో గ్రామస్థులు చితకబాదారు. దీంతో పాపను చంపేసి నది ఒడ్డున ఇసుకలో పూడ్చానని చెప్పాడు. విషయం తెలుసుకున్న అప్‌గ్రేడ్ స్టేషన్ పోలీసులు గ్రామానికి చేరుకుని, గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ కంజక్షన్, సీఐ శ్రీనివాసులు సమక్షంలో గంగాధర్‌ను నది వద్దకు తీసుకెళ్లి చిన్నారిని పూడ్చిపెట్టిన స్థలాన్ని గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీయించారు. చిన్నారి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ రత్న, ఏఎస్పీ విష్ణు పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.


గంగాధర్‌ను తాళ్లతో కట్టేసి తీసుకెళ్తున్న గ్రామస్థులు

రెండు హత్య కేసుల్లో నిందితుడు..

తూముకుంట ఎస్సీ కాలనీకి చెందిన గంగాధర్ ఇదివరకే రెండు హత్య కేసుల్లో నిందితుడు. 2012లో పెనుకొండ మండలం నాగలూరుకు చెందిన గంగరత్నమ్మ అనే మహిళ తూముకుంటకు రాగా.. గ్రామ శివారుకు తీసుకెళ్లి హత్య చేసి, ముళ్లపొదల్లో పడేసి, ఆమె చెవుల్లోని కమ్మలను ఎత్తుకెళ్లినట్లు కేసు నమోదైంది. ఆధారాలు లేకపోవడంతో కోర్టు 2017లో ఈ కేసును కొట్టివేసింది. 2020లో తూముకుంటకు చెందిన హనుమక్క(70) అనే వృద్ధురాలిని బండరాయితో మోది హత్య చేసినట్లు కేసు నమోదైంది. ఆమె వద్ద ఉన్న పింఛన్ మొత్తం రూ.3 వేలు లాక్కున్నాడు. ఈ కేసు కోర్టులో నడుస్తోంది. తాజాగా బంధువుల చిన్నారిని దారుణంగా హత్య చేశాడు. గంగాధర్ మానసిక స్థితి సరిగాలేదని పోలీసులు అంటున్నారు.

హత్యకేసు నమోదు చేశాం: ఎస్పీ

ఎనిమిదేళ్ల చిన్నారిని చంపి పూడ్చిపెట్టిన నిందితుడిపై హత్య కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. శుక్రవారం రాత్రి హిందూపురం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. తూమకుంట వద్ద ఎనిమిదేళ్ల చిన్నారిని గంగాధర్ హత్యచేసి, పూడ్చిపెట్టాడన్నారు. అప్‌గ్రేడ్ పోలీసులు వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని, ఘటనా స్థలాన్ని పరిశీలించారన్నారు. చిన్నారి మృతదేహాన్ని వెలికితీసి, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. నిందితుడిపై హత్యకేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. గతంలో ఇతడిపై రెండు హత్య కేసులున్నాయనీ, ఈ యేడాది జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. గంగాధర్ మానసిక స్థితి సరిగా లేదనీ, బెయిల్ ఇస్తే వాయిదాలకు కూడా హాజరుకాడని పోలీసులు కోర్టుకు విన్నవించారన్నారు. బెయిల్‌పై వచ్చినప్పటి నుంచి ఇంటిలో పనిచేసుకుంటూ ఉన్నాడన్నారు. ఇతడిపై రౌడీషీట్ కూడా ఉందని ఎస్పీ వివరించారు.

వేతనాలు పడ్డాయ్..!

ఒకటో తేదీనే ఖాతాలకు జమ.. పెన్షన్లు కూడా..

ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్ల హర్షాతిరేకాలు
వైసీపీ పాలన ఆద్యంతం ఎదురుచూపులే..



కదిరి, ఆగస్టు 2: గత వైసీపీ పాలనలో ఐదేళ్లూ ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లకు ప్రతినెలా ఒకటే టెన్షన్. నెలనెలా వేతన వెతలే. జీతం కోసం ఎదురుచూపులే. ఇవాళ జమవుతుంది.. రేపు పడుతుందని ఆశపడడం, నిరాశచెందడం పరిపాటిగా మారింది. ఖాతాకు ఎప్పుడు వేతనం జమవుతుందో చెప్పే నాథుడు కూడా ఉండేవాడు కాదు. ఒకటో తేదీ జమ కావాల్సిన వేతనం ఒక్కోసారి నెలాఖరులో కూడా పడింది. పెన్షనర్ల పరిస్థితీ అంతే. సమయానికి ఆస్పత్రికి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడేవారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి వర్ణనాతీతం. వేతనాలు నెలలకొద్దీ కూడా బకాయిలు పెట్టారు. ప్రతినెలా నిర్దేశిత సమయానికి బ్యాంకు కంతులు చెల్లించలేక ఉద్యోగులు తిప్పలు పడేవారు. చాలామంది డీఫాల్ట్ కూడా అయ్యారు. పాల బిల్లు ఇచ్చేందుకు కూడా వాయిదాలు వేయాల్సి వచ్చేంది. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో పరస్థితి పూర్తిగా మారిపోయింది. ఈనెల ఒకటో తేదీనే ఉద్యోగులందరికీ వేతనాలు జమయ్యాయి. పెన్షనర్లకు కూడా సొమ్ము అందింది. దీంతో ఆ వర్గాలు హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నేళ్లయిందో ఇలా ఒకటో తారీఖు వేతనాలు, పెన్షన్లు తీసుకుని అని చర్చించుకుంటున్నారు. వైసీపీ పాలనలోని రోజులను తలచుకుని భయపడిపోతున్నారు.

ఒకటో తేదీ వస్తోందంటే టెన్షన్..

ఒకటో తేదీ వచ్చిందంటే ఉద్యోగులు, పెన్షనర్లకు గతంలో ఒకటే టెన్షన్. అదే వేతనాల టెన్షన? కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆ టెన్షన్ నుంచి విముక్తి లభించింది. రెండునెలల నుంచి ఒకటో తేదీనే జీతం, పెన్షన్ పడుతోంది. దీంతో ఉద్యోగులకు ఈఎంఐ పెనాల్టీ బాధలు తప్పాయి. లబ్ధిదారులు నిద్రలేవక ముందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము ఇంటివద్దకే వస్తోంది. దీంతో ఒకటో తేదీ అంటే గతంలో భయపడే వారు.. ఇప్పుడు పండుగలా భావిస్తున్నారు.

నిద్రలేవకనే పింఛన్లు..

లబ్ధిదారులు నిద్రలేవకనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇవ్వడానికి సచివాలయ ఉద్యోగులు తలుపు తడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.నాలుగువేలు పింఛన్ అందిస్తున్నారు. గత నెలలో అదనంగా రూ.మూడువేలు కలిపి, రూ.ఏడువేలు చెల్లించారు. ఈ నెల ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందించారు. కదిరి నియోజకవర్గంలో 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు అధికారులు అంటున్నారు. లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో ఒక్కశాతం మిగిలిపోయినట్లు చెబుతున్నారు. చాలామందికి పొలాల వద్ద, చికిత్సలు పొందుతున్న వారికి ఆస్పత్రుల వద్దకెళ్లి పింఛన్ సొమ్మును సచివాలయ సిబ్బంది అందించారు. గతంలో వలంటీర్ పింఛన్లు అందించి పింఛన్‌దారుల నుంచి అంతోఇంతో ఆశించేవారు. ఇప్పుడు అటువంటి అవసరం లేకుండా సచివాలయ సిబ్బంది సక్రమంగా, నేరుగా పింఛన్లు అందిస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈఎంఐ పెనాల్టీల్లేవు..

గత ఐదు సంవత్సరాలు ఒకటో తేదీన జీతాలు రాకపోవడంతో ఉద్యోగులు తీసుకున్న గృహ, వ్యక్తిగత, విద్యారుణాలకు ఫైనాల్టీలు కట్టలేక ఇబ్బందులు పడేవారు. ప్రతినెలా 10నగానీ, 12వ తేదీనగానీ, ఒక్కోసారి రెండు నెలలకు ఒకసారి వేతనాలు అందేవి. ప్రస్తుతం నెలనెలా జీతాలు అందుతుండడతో ఈఎంఐ పెనాల్టీ బాధలు తప్పాయి.

1న జీతాలు.. ఆనందించదగ్గ పరిణామం



ప్రతి ఉద్యోగి ఒకటో తేదీన వేతనం తీసుకోవాలనుకుంటాడు. గత ఐదేళ్లూ వేతనం కోసం ఎదురుచూడడం పరిపాటిగా మారింది. దినసరి ఖర్చులు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, బ్యాంకు రుణాల కంతులు, సకాలంలో జీతాలు అందక చెల్లించలేక అపరాధ రుసుం చెల్లించేవారం. ప్రస్తుతం ఒకటో తేదీన జీతం ఉద్యోగుల ఖాతాల్లో జమ కావడం ఆనందంగా ఉంది. ఇదే ఆన్వాయితీని ప్రభుత్వం కొనసాగించాలి.

- హరిప్రసాద్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఎన్నేళ్లయిందో..!



చిన్న ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి, డ్రైవర్‌గా ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందా. అప్పటి నుంచి ఎన్ని ప్రభుత్వాలు మారినా, ప్రతినెలా జీతంలాగా పెన్షన్ తీసుకునేవాడిని గత వైసీపీ ప్రభుత్వంలో మాత్రం పెన్షన్ ఎప్పుడొస్తుందో.. కూడా.. తెలియని పరిస్థితి ఏర్పడింది. బ్యాంకు చుట్టూ ప్రదక్షిణ చేశా. పెన్షన్ సొమ్ము జమకాక, బయట అప్పుటు పుట్టక అగచాట్లు పడ్డా. ప్రస్తుతం ఒకటో తేదీనే పెన్షన్ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమవడం ఆనందంగా ఉంది.

- చిన్నరామన్న, రిటైర్డ్ ఉద్యోగి, తనకల్లు

కూలి బతుకుల్లో కన్నీళ్లు..!

కూలీల ఆటోను ఢీకొన్న లారీ

- పులివెందుల వద్ద ప్రమాదం
- జిల్లాకు చెందిన ఇద్దరు మహిళల మృతి
- 15 మందికి గాయాలు


గుంతలో పడిపోయిన ఆటో



నాగమ్మ, కదిరమ్మ (ఫైల్)

కదిరి, ఆగస్టు 2: తెలతెలవారకనే కూటి కోసం పరుగు పెట్టిన బతుకులు నడి మధ్యలోనే తెల్లారిపోయాయి. కడప జిల్లాలోని పులివెందుల సమీపాన నామాలగుండు దాటిన తరువాత కూలీల ఆటోను లారీ ఢీకొన్న జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు మృతిచెందగా.. 15 మంది గాయపడ్డారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తలుపుల మండలంలోని బత్రేపల్లికి చెందిన పలువురు కడప జిల్లాలోని పులివెందులకు వ్యవసాయ కూలి పనులకెళ్తుంటారు. రోజుమాదిరిగానే శుక్రవారం ఉదయం కూడా 17 మంది కూలీలు బత్రేపల్లి నుంచి పులివెందులకు ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పులివెందుల సమీపాన నామాలగుండు దాటిన తరువాత ఆటోను వెనుకనుంచి లారీ ఢీకొట్టింది. దీంతో పక్కనే ఉన్న గుంతలోకి ఆటో బోల్తాపడింది. ఆటోలోని భూక్యా నాగమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందగా.. 16 మంది గాయపడ్డారు. వారిలో కొమెర కదిరమ్మ (32)ను కడప ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. మిగిలిన 15 మందిలో పదిమంది కడప రిమ్స్, ముగ్గురు పులివెందుల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా.. ఇంటికెళ్లిపోయారు. గాయపడినవారిలో కె. వెంకటలక్ష్మమ్మ, రమణమ్మ, శైలజ, కదిరమ్మ, కె. రమణమ్మ, బాలెమ్మ, నాగముని, అనూష, రమణమ్మ, రత్నమ్మ, రమాదేవి, ఆంజనేయులు, ఈశ్వరయ్య, శకుంతల, లక్ష్మీదేవి ఉన్నారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిసింది.

కన్నీరుమున్నీరైన బాధితుల బంధువులు

తమవారు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని, తీవ్రంగా గాయపడ్డారని తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు బత్రేపల్లి నుంచి హుటాహుటిన పులివెందులకు వెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్ ఆస్పత్రికి తరలివెళ్లారు. చనిపోయిన, గాయపడిన తమవారిని చూసి బోరున విలపించారు.

బత్రేపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో మృతిచెందిన భూక్యా నాగమ్మకు భర్త వెంకటనారాయణ నాయక్, ఇద్దరు కుమారులున్నారు. కదిరమ్మకు భర్త బాలాజీ, ఇద్దరు కుమారులున్నారు. కూలి పనులే వీరికి జీవనాధారం.


కడప రిమ్స్‌లో గాయపడిన కూలీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ఎమ్మెల్యే ఆర్థికసాయం

రోడ్డు ప్రమాద విషయం తెలియగానే కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడి నుంచి పులివెందుల ప్రభుత్వాస్పత్రికెళ్లి బాధితులను పరామర్శించి, మృతిచెందిన వారి కుటుంబాలను ఓదార్చారు. కడప రిమ్స్ ఆస్పత్రికెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

5న పోస్టర్ డిజైనింగ్ పోటీ

పుట్టపర్తి: జిల్లా టూరిజం కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 5న పోస్టర్ డిజైనింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను తెలుపులా పోస్టర్ డిజైన్ పోటీలను స్థానిక సాయిఆరామంలో నిర్వహిస్తున్నామన్నారు. వినూత్న రీతిలో డిజైన్ చేసిన పోస్టర్లకు రూ.10వేలు బహుమతి అందజేస్తామని తెలిపారు. ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, జిల్లా పర్యాటక శాఖాధికారి జయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయ్‌కుమార్, సీపీఓ విజయకుమార్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్ వివరాలివ్వండి

- కలెక్టర్ చేతన్


ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్


తాడిమర్రి, ఆగస్టు 2: మండలంలోని సీసీ రేవు గ్రామం వద్ద గతంలో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తనకివ్వాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. మైనింగ్ శాఖ ఏడీ రామ్మోహన్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఉప్పలపాడు, సీసీ రేవు ఇసుక రీచ్‌ల మధ్య దూరాన్ని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇసుకను ఎలా, ఎంత తరలించారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇసుక అక్రమంగా తరలించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానిక అధికారులకు సూచించారు. పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, డీటీ భాస్కర్‌రెడ్డి, రీసర్వే డీటీ మౌనిక, ఎస్ఐ నాగాస్వామి పాల్గొన్నారు.

హనుమాన్ దర్శనానికి ప్రత్యేక బస్సులు

హిందూపురం అర్బన్: శ్రావణమాసం పురస్కరించుకొని హనుమాన్ దర్శనానికి హిందూపురం డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం శ్రీకాంత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆంజనేయ స్వామి ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలైన నేమకల్లు, కసాపురం, మురడి క్షేత్రాలు 15వ శతాబ్దంలో వ్యాసరాయులచే ప్రతిష్ఠింపబడ్డాయన్నారు. శ్రావణమాసంలో ఒకే రోజు ఈ మూడు పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడం అత్యంత పుణ్యకార్యమన్నారు. భక్తుల సౌకర్యార్థం హిందూపురం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుందన్నారు. ఈ నెల 8వతేదీ, 17వ తేదీ, 24వ తేదీ, 31వ తేదీల శనివారాల్లో మరల 6వ తేదీ, 13వ తేదీ, 20వ తేదీ, 27వ తేదీ మంగళవారాల్లో ప్రత్యేక బస్సు లు నడుపుతున్నామన్నారు. రానుపోను ఒక్కొక్కరికి పెద్దలకు రూ.710, పిల్లలకు రూ.380 చార్జీలు ఉంటాయన్నారు. భక్తులు హనుమంతుడిని దర్శించుకుని పునీతులు కావాలన్నారు. వివరాలకు 7382861542, 8977225997 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాబు పర్యటన తీరు ప్రశంసనీయం

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



మడకశిర, ఆగస్టు 2: సీఎం చంద్రబాబునాయుడు మడకశిరకు రావడం చాలా సంతోషకరమని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఒక ప్రభుత్వ కార్యక్రమాన్ని చాలా సాదాసీదాగా నిర్వహించారని, బలవంతపు తరలింపులు లేకపోవడం అభినందనీయమన్నారు. ఆయన శుక్రవారం తన స్వగ్రామం నీలకంఠాపురంలో విలేకరులతో మాట్లాడారు. మడకశిరలో పదేళ్లుగా నెలకొన్న సాగు, తాగునీటి సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. పరిశ్రమలు, రోడ్లు వంటి వాటికి సంబంధించి రైతులకు ముఖ్యమంత్రి స్పష్టమైన హామీలు ఇవ్వడం పట్ల మడకశిరవాసిగా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వాటన్నింటినీ వెంటనే అమలు పరిచేశక్తి ఈ ప్రభుత్వానికి ఇవ్వాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదానికి సుప్రీంకోర్టు పరిష్కారం చూపించిందని అన్నారు. దీంతో అందరికీ మేలు జరుగుతుందని భావిస్తున్నానని వెల్లడించారు.

30 ఏళ్ల పోరాటానికి ఫలితం

ఎస్సీ వర్గీకరణపై ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు తదితరులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 2: వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా జరుగుతున్న పోరాటానికి ఫలితం లభించిందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై 30 ఏళ్ల పోరాటం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం కొన్నేళ్లుగా మందకృష్ణ మాదిగ, ఇతర నాయకులు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. గతంలో కొందరు నాయకులు ఈ ఉద్యమాన్ని తమ స్వార్థం కోసం తొక్కి పెట్టారన్నారు. ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే మాదిగలకు అండగా నిలబడి వారి భావోద్వేగాన్ని అర్థం చేసుకున్నార న్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా లక్షలాది మంది మాదిగలకు, 59 ఉప కులాలకు మేలు జరగబోతోందన్నారు. ఎస్సీ, ఎస్టీల్లోని నిజమైన పేదలకు రిజర్వేషన్ ఫలాలు అందుతాయన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తమ ప్రభుత్వం త్వరలోనే అమలు చేయబోతోందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ.. వర్గీకరణపై సుప్రీం తీర్పు దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీఆర్ దాస్, టీడీపీ నాయకులు బుగ్గయ్య చౌదరి, డిష్ నాగరాజు, కూచి హరి, లక్ష్మీనరసింహ, సరిపూటి రమణ, లక్ష్మీనరసింహులు, వెంకటనారాయణ, కృష్ణకుమార్, నారాయణస్వామి, ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

మాజీ మంత్రి సాకే శైలజానాథ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టును స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు వేగవంతం చేసి తగిన న్యాయం చేకూరేలా చూడాలని ఆయన కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎంతో మంది పోరాటం చేశారని, ఇప్పటికైనా తగిన న్యాయం జరిగినందుకు సంతోషమన్నారు. రాజకీయాలకు తావులేకుండా వెంటనే అమలు చేయాలన్నారు. అప్పటి వరకు ఉద్యోగోన్నతులు, ఉద్యోగ నియామకాలు నిలిపి వర్గీకరణ పూర్తి చేసిన తరువాత అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం నీట్ విద్యార్థులకు అయిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

● అనంతపురం క్లబ్‌కు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పూర్వవైభవం తీసుకొచ్చి ప్రారంభిస్తామని చెప్పడం సంతోషకరమని శైలజానాథ్ పేర్కొన్నారు. క్లబ్‌లో పేకాట ఆడిస్తామని ఎమ్మెల్యే ఏమీ చెప్పలేదనీ, క్రీడాపరంగా అభివృద్ధి చెస్తామన్న ఆలోచనతో అలా అని ఉండవచ్చని విలేకరుల ప్రశ్నకు బదులిచ్చారు. కమిటీ సభ్యుల ఎన్నిక ప్రణాళిక ప్రకారం, నిబంధనల మేరకు జరిగేలా చూడాలన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

కొత్తచెరువు, ఆగస్టు 2: ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్‌లో చేరే అభ్యర్థులు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈ లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ఈనెల 27తో గడువు ముగుస్తుందన్నారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపీఎన్ఎస్‌సీహెచ్ఓఓఎల్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబరు 4దాకా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



విద్యుద్దీపాల వెలుగులో టీబీ డ్యాం

బొమ్మనహాళ్, ఆగస్టు 2: తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో శుక్రవారం సాయంత్రానికి 1,90,653 క్యూసెక్కులుగా ఉంది. దీంతో జలాశయానికి ఉన్న 33 గేట్లలో 28 గేట్లను నాలుగు అడుగులు, మిగతా 5 గేట్లను ఒక్కటిన్నర అడుగులు పైకి ఎత్తి నీటిని నదికి విడుదల చేశారు. ప్రస్తుతం ఔట్‌ఫ్లో నదికి, కాలువలకు వదిలే నీటితో కలిపి 1,82,160 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105.788 టీఎంసీలుండగా శుక్రవారం సాయంత్రానికి 1631.29 అడుగులతో 99 టీఎంసీల నీటి నిల్వ ఉంది. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కి.మీ. వద్ద 1139 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17,500, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.11వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 651టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మొదలెట్టేశారు!

పంచాయతీరాజ్‌లో పోస్టింగ్‌ల గోల..!

- ఈఈలు, డీఈఈల పోస్టులకు తీవ్రపోటీ
- ఎవరికివారుగా అధికార వర్గాల పైరవీలు
- కొందరిలో పోస్టింగ్, మరికొందరిలో బదిలీ టెన్షన్



జిల్లా పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగుల్లో బదిలీల ఉత్కంఠ సాగుతోంది. ప్రధానంగా ఈఈ, డీఈఈల పోస్టింగ్‌ల కోసం పెద్దఎత్తున పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. అయితే బదిలీలకు సంబంధించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఆశాఖ ఉద్యోగులు ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

- అనంతపురం సిటీ

ఈఈలు, డీఈఈల పోస్టులకు తీవ్రపోటీ

ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) ఈ రెండు పోస్టులు ఎంతో కీలకమైనవి. దీంతో ఈ పోస్టుల కోసం ఆశాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లానే కాకుండా కర్నూలు జిల్లా నుంచి ఒక అధికారి డీఈఈగా వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఉమ్మడి జిల్లా పరంగా.. పీఆర్ఐ అనంతపురం, పీఐయూ పెనుకొండ, క్యూసీ ఈఈ, అనంతపురం పీఐయూ ఈఈల పోస్టుల కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోందని సమాచారం. డీఈఈల పరంగా పరిశీలిస్తే.. ఇప్పటికే అనంతపురం పీఆర్ఐ -1, అనంతపురం పీఆర్ఐ-2 డివిజన్‌లకు ఇన్‌చార్జి డీఈఈలు వచ్చేయగా.. మిగిలిన క్యూసీ విభాగంలో - 2, పీఆర్ఐ అనంతపురం పరంగా.. కళ్యాణదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, పీఐయూ విభాగం పరంగా.. 2 డీఈఈల పోస్టుల కోసం పెద్దఎత్తున ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేస్తున్నారని తెలిసింది.

గుట్టుగా పైరవీలు...

ఈఈలు, డీఈఈల పోస్టింగ్‌ల కోసం ఆ శాఖలో పనిచేస్తున్న కొందరు ఈఈలు, కొందరు డీఈఈలు ఎవరి స్థాయిలో వారు తమదైన శైలిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న ఒక డీఈఈ అనంతపురం ఈఈ పీఏ స్థానంలో ఇక్కడికి వచ్చి అదే ఈఈ పోస్టింగ్‌కు ఇన్‌చార్జి గా వ్యవహరించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అది కుదరకపోతే క్యూసీ ఈఈగా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. పీఐయూ విభాగంలో పనిచేస్తున్న ఒక డీఈఈ మాత్రం క్యూసీ డీఈఈగా వచ్చి అదే క్యూసీ ఈఈ పోస్టింగ్ ఇన్‌చార్జి ఈఈగా కూడా పోస్టింగ్ పొందాలని ప్రయాత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు అదే పీఐయూ విభాగంలో ముగ్గురు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కూడా తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తూ..పీఆర్ఐ పరంగా కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం ఇన్‌చార్జి డీఈఈలుగా వెళ్లాలని ప్లాన్ చేసుకున్నట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఇదే శాఖకు చెందిన మరో ఇద్దరు అధికారులు కూడా ఒకరు పీఐయూ ఈఈగా కానీ, పెనుకొండ పీఐయూ ఈఈగా కానీ, పీఆర్ఐ ఈఈగా కానీ పోస్టింగ్ పొందేందుకు తీవ్రంగా యత్నిస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో మరో అధికారి కూడా పీఆర్ఐ డీఈఈగా వచ్చి పీఆర్ఐ ఈఈగా పోస్టింగ్ కోసం కథ నడుపుతున్నారని జోరుగా చర్చసాగుతోంది. ఇలా అదే శాఖలో పనిచేస్తున్న మరికొందరు అధికారులు కూడా తమదైన శైలిలో ఆయా పోస్టింగ్‌ల కోసం పెద్దఎత్తున పైరవీలు మొదలెట్టారు. కాగా మరో మూడు నెలల్లో ఆశాఖ ఎస్ఈ స్థాయి అధికారి కూడా ఉద్యోగ విరమణ ఉండటంతో ఆ పోస్ట్ కోసం కూడా పోటీ నెలకొన్నట్లు తెలిసింది. అయితే అంతలోనే ఉద్యోగోన్నతుల ప్రక్రియ సాగుతుందని కూడా ప్రచారం ఉంది.

కొందరిలో ఆందోళన

శాఖలో పనిచేస్తున్న కొందరు ఈఈలు, డీఈఈలు ఎవరికి వారు తమదైన శైలిలో పైరవీలు చేస్తుండటంతో ఇప్పటివరకు ఆయా పోస్టుల్లో పనిచేస్తున్న అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఎప్పుడు, ఎక్కడికి ఎవరిని బదిలీ చేస్తారో.. అని బాధిత వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రధానంగా ముగ్గురు ఈఈలు, ముగ్గురు డీఈఈలు అంతర్మథనం చెందుతున్నారని సమాచారం. ఇద్దరు అధికారులైతే మరీ దారుణం. గత ప్రభుత్వంలో లక్షలు వెచ్చించి పోస్టింగ్ తెచ్చుకున్నామని.. ఇప్పుడు తమను కదిలిస్తే ఎలా అని కొందరి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏది ఏమైనా శాఖ పరంగా జరుగుతున్న తాజా పరిణామాలు ఆశాఖ వర్గాల్లో ఉత్కంఠ రేపడంతో పాటు కొందరు అధికారుల్లో బదిలీల ఆందోళన మొదలైంది.

ఆశాఖ వర్గాల్లో చర్చ...

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి స్పష్టమైన ఉత్తర్వులు రాకపోయినా కొందరు అధికారులు పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ఆశాఖలో జోరుగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో మిగిలిన అధికార వర్గాలు సైతం పోస్టింగ్‌ల కోసం పైరవీలు మొదలెట్టాయి. కొందరైతే మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సుల కోసం క్యూ కట్టారని తెలిసింది. మరికొందరు అధికారులు తమదైన శైలిలో కాసులు కూడా సమర్పించి పోస్టింగ్ తెచ్చుకోవాలని పథకం వేశారని తెలుస్తోంది. పైగా శాఖలో రెగ్యులర్ డీఈఈలు లేకపోవడం, మరోవైపు శాఖలో ఉద్యోగోన్నతులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లే పైరవీల ద్వారా ఇన్‌చార్జి డీఈఈ పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు. ఈ తరహా పోస్టింగ్‌లు గత ప్రభుత్వంలో భారీగా జరిగాయి. ఏది ఏమైనా పీఆర్‌లో కొందరికి బదిలీ ఫీవర్ పట్టుకుంటే.. మరికొందరికి పోస్టింగ్ భయం పట్టుకున్నట్లైంది.



కల్లూరు ఏటీఎంలో చోరీ

రూ.3.28లక్షలు అపహరణ



నిందితులు కట్ చేసి చోరీకి పాల్పడిన ఏటీఎం

గార్లదిన్నె, ఆగస్టు 2: గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి అందులోని నగదుతో దుండగులు ఉడాయించిన సంఘటన మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని కల్లూరు ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చారు. ముఖం కనిపించకుండా మంకీ క్యాప్‌లు వేసుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో మొదటగా ఏటీఎంలోని డిపాజిట్ ఏటీఎంను కట్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తర్వాత విత్‌డ్రాల ఏటీఎంను కట్ చేసి అందులోని రూ.3,28,600 నగదుతో ఉడాయించారు. ఏటీఎంలో చోరీ జరుగుతున్నట్లు మంగళగిరిలోని ఎస్‌బీఐ ఆఫీస్‌కు మెసేజ్ వెళ్లింది. అక్కడి భద్రతా సిబ్బంది అనంతపురం పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే అప్రమత్తమైన అనంతపురం డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ గౌస్‌బాషా సంఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే దుండగులు పారిపోయారు. ఈ ఘటనపై ఎస్‌బీఐ మేనేజర్ రామాంజిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మాకు నచ్చిన చోటుకే పోతాం!

- ☆ పాత స్కూల్‌కు వెళ్లమంటున్న టీచర్లు
- ☆ ఎస్ఎస్ఏ నుంచి పలువురు రిలీవ్
- ☆ వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఎంట్రీ
- ☆ ప్రభుత్వం మారడంతో ఎట్టకేలకు బయటకు
- ☆ ఇప్పుడు దగ్గరి స్థానాల కోసం యత్నాలు
- ☆ రూ.లక్షలు కుమ్మరించేందుకైనా సిద్ధం!

అనంతపురం విద్య, ఆగస్టు 2: సమగ్రశిక్ష ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయిన టీచర్లకు 'దగ్గరి' స్థానాలు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు యత్నిస్తున్నట్లు తెలిసింది. సుదూరప్రాంతాల్లోని స్కూళ్ల నుంచి అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సుతో చాలా మంది టీచర్లు ప్రాజెక్టులోకి వచ్చారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా, నిబంధనలు పాటించకుండానే ప్రాజెక్టులోకి వీరు ఎంట్రీ ఇచ్చారు. అప్పటి కలెక్టర్, ఏపీసీ, డీపీసీ నిబంధనలు పాటించలేదు. దీంతో వైసీపీ ముద్ర పడిన టీచర్లు చాలామంది సులువుగా దొడ్డిదారిలో ప్రాజెక్టులోకి సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులుగా వచ్చి స్థిరపడ్డారు. ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ చేసిన కలెక్టర్ అలాంటి అధికారులను వెంటనే రీప్యాట్రేషన్ చేయాలంటూ డీపీసీకి, ఏపీసీకి ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇటీవల అధికారులు వారిని రిలీవ్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయ్యి డీఈఓకు రిపోర్ట్ చేసుకున్న టీచర్లను వాళ్లు వచ్చిన చోటు(పాత స్కూల్)కే పంపాలి. లేదా అక్కడ ఖాళీ లేకుంటే అదే మండలంలోని స్కూల్‌కు లేదా అదే హెచ్ఆర్ఏ స్కూల్‌కు పంపాలి. అయితే ఇప్పుడు కొత్త స్కూళ్లకు, దగ్గరలోని స్కూళ్లకు వెళ్లాలని కొందరు టీచర్లు అధికారులతో పైరవీలకు సిద్ధమైనట్టు సమాచారం. వచ్చిన చోటుకు కాకుండా నచ్చిన చోటకు వెళ్లడానికి ట్రై చేస్తున్నట్టు తెలిసింది. దీనికి వెనుక లక్షలు చేతులు మారుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి ఇలా..

ప్రాజెక్టులోని వచ్చిన చాలామంది టీచర్లలో 80 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల దూరంలోని స్కూళ్లలో పనిచేస్తున్న వారే అధికంగా ఉన్నారు. కొందరు పక్క జిల్లాల నుంచి కూడా వచ్చారు. అంత దూరం వెళ్లలేక..పైరవీలతో జిల్లా కేంద్రంలోని ప్రాజెక్టులోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు దక్కించుకుని ఇక్కడే తిష్టవేశారు. గత ప్రభుత్వంలో వచ్చినవారి స్కూళ్లు, మండలాలు, జిల్లాలు పరిశీలిస్తే.... ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి డీ హీరేహాళ్ మండలం లోని దేవగిరి ఎంపీపీ స్కూల్ నుంచి, అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి డీ. హీరేహాళ్ మండలంలోని కడలూరు ఎంపీయూపీ స్కూల్, మరో అసిస్టెంట్ ఏఎంఓ చంద్రమోహన్‌రెడ్డి ఉరవకొండ మండలంలోని వ్యాసాపురం ఎంపీయూపీ స్కూల్ నుంచి, అసిస్టెంట్ అలెస్కో గోవింద్‌రెడ్డి బెళుగుప్ప మండలంలోని జడ్పీ హైస్కూల్ నుంచి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్ విడపనకల్లు మండలంలోని హావళిగి స్కూల్ నుంచి, జీసీడీఓ మహేశ్వరి శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు గర్ల్స్ జడ్పీ హైస్కూల్ నుంచి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాంప్రసాద్‌రెడ్డి డీ.హీరేహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట స్కూల్ నుంచి అసిస్టెంట్ ఐఈడీ షమా కర్నూలు జిల్లా ఆలూరు మోడల్ స్కూల్ నుంచి వచ్చినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఫిర్యాదులతో వెనక్కు..

గతంలో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు. కేవలం వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు చెప్పారంటూ అప్పటి అధికారులు వీళ్లను ప్రాజెక్టులోకి తీసుకున్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వారి నియామకంపై కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కలెక్టర్ విచారణ చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా వచ్చిన వారిని వెంటనే రీప్యాట్రేషన్ చేశారు. దీంతో రీప్యాట్రేషన్ అయిన వారిలో చాలా మందిని డీపీసీ, ఏపీసీ రిలీవ్ చేశారు. అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అసిస్టెంట్ అలెస్కో గోవింద్‌రెడ్డి, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ రాంప్రసాద్, జీసీడీఓ మహేశ్వరిని ఇప్పటికే రిలీవ్ చేయడంతో... వాళ్లు డీఈఓ ఆఫీస్‌లో రిపోర్టు చేసుకున్నారు.

దగ్గరి స్థానాలపై ఒత్తిళ్లు..

ప్రాజెక్టు నుంచి రిలీవ్ అయిన టీచర్లు తమకు దగ్గరి స్థానాలు కేటాయించాలని జిల్లా విద్యాశాఖాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. అనంతపురం జిల్లా కేంద్రానికి సమీపంలోని స్కూళ్లు, జాతీయ రహదారికి సమీపంలోని స్కూళ్లు, రోడ్ పాయింట్ ఉన్న స్కూళ్లను తమ ఆప్షన్లుగా జిల్లా విద్యాశాఖాధికారుల వద్ద ఉంచిన ట్టు తెలిసింది. నిబంధనల మేరకు ప్రాజెక్టులోకి రావడానికి ముందు ఏ స్కూల్‌లో పనిచేస్తుండేవారో...అదే ఏ స్కూల్‌కు వెళ్లాలి. ఒక వేళ ఆ స్కూల్‌లో వేకెన్సీ లేకుంటే... అదే మండలంలోని స్కూల్‌కు వెళ్లాలి, లేదా గతంలో పనిచేస్తున్న హెచ్ఆర్‌సీ స్కూల్‌కు వెళ్లాలి. అధిక హెచ్ఆర్‌సీ స్థానాలకు వెళ్లడానికి వీళ్లేదు. డీఈఓ సైతం అధిక హెచ్ఆర్సీ స్థానాలు ఇవ్వడానికి వీల్లేదు. గతంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు ఇదే చెబుతున్నాయి. ఇప్పుడు కొందరు పైరవీలు మొదలెట్టారు. వచ్చిన చోటు (పాత స్కూల్)కు కాకుండా నచ్చిన నోటు (కొత్తస్కూల్)కు వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. కొత్త ప్లేసులకు దక్కించుకోడానికి లక్షలు గుమ్మరించడానికి సైతం వెనకాడలేదని సమాచారం. పైరవీకారుల ప్రయత్నాలకు అధికారులు తలొగ్గితే కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీలకు ఫిర్యాదు చేసేందుకు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిద్ధమైనట్లు తెలిసింది.

అట్టహాసంగా సత్య ఏజెన్సీస్ ప్రారంభం



సత్య ఏజెన్సీస్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 2: జిల్లాకేంద్రంలోని సుభాష్ రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన సత్య ఏజెన్సీస్ 27వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి షాపింగ్‌మాల్ బిల్డింగ్ ఓనర్ సుకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లు మొదలు కొని అన్నిరకాల ఎలక్ట్రానిక్ సామగ్రిని ప్రజలకు అందుబాటుధరల్లో అందించేందుకు సత్య ఏజెన్సీస్‌ను నెలకొల్పడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ఎండీ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పీఏగా శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు2: ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పీఏగా కళ్యాణదుర్గం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డీఈగా ఉన్న శ్రీనివాసులుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఉన్న ఎస్ఈ పీఏ రంగయ్య వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. దీంతో శ్రీనివాసులును నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

విజిలెన్స్ సీఐ వెంకటరమణ బదిలీ

విజిలెన్స్ సీఐ వెంకటరమణ బదిలీ అయ్యారు. కర్నూలు నుంచి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సీఐగా వచ్చారు. అయితే తిరిగి కర్నూలుకే బదిలీపై వెళ్లారు అక్కడ రిపోర్ట్ చేసుకున్న అనంతరం పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిసింది. విజిలెన్స్ విభాగంలో ముగ్గురు సీఐలు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఎస్ఐలది అదే పరిస్థితి.

● కళ్యాణదుర్గం రేంజర్‌గా చంద్రహాసన్ నియమితులయ్యారు. కర్నూలు జిల్లాలో డీఆర్వోగా ఉన్న ఈయనకు ఉద్యోగోన్నతి కల్పించి కళ్యాణదుర్గం రేంజర్‌గా నియమించారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి: ఏడీఏ



పొలంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ

నంబులపూలకుంట, ఆగస్టు 2: ఖరీఫ్‌లో సాగు చేసి వేరుశనగ పంటను ఆశిస్తున్న ఆకుముడత, పొగాకు లద్దె పురుగు, టిక్కా ఆకుమచ్చ తెగుళ్ల నివారణ చర్యలు తీసుకోవాలని ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని వెలిచెలమల గ్రామంలో పొలంబడి నిర్వహించారు. రైతులు యజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా చీడపీడలను నివరించవచ్చన్నారు. రసాయనిక ఎరువులు అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. ఆకుముడత నివారణకు క్లోరోపైరిపాస్ 2.ఎంఎల్, లేదా ప్రెఫోనో పాస్ రెండు ఎంఎల్ లీటర్ నీటిలో, టిక్క ఆకుమచ్చ నివారణకు హెక్సాప్రోనోజోల్ 2 ఎం.ఎల్. లీటర్ నీటికి, లద్దె పురుగు నివారణకు రెండు కిలోల బెల్లం, 8 కిలోల తవుడు, వందగ్రా. థైయోడికార్బాను విషపు ఎరగా వాడి నివారించవచ్చన్నారు. వేరుశనగ పంట పూత దశలో ఉండటంతో ఎకరాకు రెండువందల కిలోల జిప్సమ్‌ను వినియోగిస్తే గింజ బరువు, నూనె శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఎం రమణప్ప, ఆర్బీకే సిబ్బంది, ఎంపీఈఓలు, ఎఫ్ఈఎస్ ప్రతినిధి సంధ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులున్నారు.

మరమ్మతుకు నోచుకోని తాగునీటి బోరు



సీఎం తండాలో చెడిపోయిన తాగునీటి బోరు

గాండ్లపెంట, ఆగస్టు 2: మండలంలోని వేపరాల పంచాయతీ సీఎం తండా గ్రామంలో ఎగువ ప్రాంతంలో పంచాయతీ బోరు చెడిపోయి మూడు నెలలు అవుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. మరమ్మతుల కోసం బోరు మోటారు బయటకు తీశారని, అయితే ఇంతవరకు మరమ్మతులు చేయలేదని తెలిపారు. దీంతో వ్యవసాయ బోర్ల నుంచి ట్యాంక్‌కు నీటిని అందిస్తున్నారని, తాగునీటి బోరు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలని లక్ష్మీ, లలితమ్మ, పార్వతమ్మ, వెంకటరమణనాయక్, సావిత్రమ్మ, సీతమ్మ కోరారు. ఈ విషయంపై సర్పంచ్ ఉమాదేవిని వివరణ కోరగా.. పంచాయతీలో నిధులు కొరతతోనే మరమ్మతులు చేయించలేదన్నారు. కార్యదర్శి వసుంధరా దేవిని ఈ విషయాన్ని తెలపగా, వెంటనే మరమ్మతులు చేసి, నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

ఆస్పత్రి వద్దకే పింఛన్



హిందూపురం ఆస్పత్రిలో దంపతులకు పింఛన్ అందిస్తున్న సిబ్బంది

గాండ్లపెంట, ఆగస్టు 2: మండలంలోని కురమామిడి పంచాయతీలోని పెద్దతండాకు చెందిన ఖజానాయక్ అనారోగ్యంతో హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అతని భార్య బూకే సాలెమ్మ కూడా అతనికి తోడుగా అక్కడే ఉంది. బూకే సాలెమ్మకు వృద్ధాప్య పింఛన్ రూ. 4 వేలు, ఖజానాయక్‌కు దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలు మంజూరైంది. ఆ సచివాలయ ఉద్యోగి వెల్ఫేర్ అసిస్టెంట్ రియాజ్ 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న హిందూపురానికి శుక్రవారం వెళ్లాడు. ఆస్పత్రిలో ఆ దంపతులకు మొత్తం రూ. 10 వేలు పింఛన్ అందించాడు. ఆ ఉద్యోగికి ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్‌కోసం ఎదురు చూపు



సచివాలయం వద్ద వేచివున్న పింఛన్‌దారులు

నంబులపూలకుంట, ఆగస్టు 2: ప్రతి పింఛన్‌దారుడికి ఒకటో తేదీనే పింఛన్ అందించాలని ఎన్డీయే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఆ రోజు పింఛన్ అందని వారికి రెండో తేదీన పింఛన్లు అందిస్తారు. మండల కేంద్రంలో అలా మొదటి రోజు పింఛన్ అందని వారు.. స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకుంది. అధికారులు కోసం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎదురు చూడాల్సి వచ్చింది. 11 గంటలకు అధికారులు రావడంతో వారు పింఛన్ తీసుకొని వెళ్లారు. అధికారులు సమయ పాలన పాటించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్య



షబ్బీర్ (ఫైల్)

ధర్మవరంరూరల్, ఆగస్టు 2 : మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన రైతు షబ్బీర్ (35) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. షబ్బీర్ తన గ్రామంలో చికెన్‌షాపు, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 15 రోజుల కిందట తన భార్య దిల్షాద్‌తో గొడవ పడ్డాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన షబ్బీర్ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో శుక్రవారం పురుగులమందు తాగాడు. కొద్ది సేపు అనంతరం గమనించిన కుటుంబసభ్యులు అతన్ని హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. షబ్బీర్‌కు భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరంరూరల్ మండలంలోని దర్శినమల గ్రామానికి చెందిన అక్కులప్ప శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కులప్ప ఉదయం తోటలోకి వెళ్లలేదని ఇంట్లో వాళ్ల మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. ధర్మవరంలోని మార్కెట్‌యార్డు వద్ద పెట్రోల్‌బంకు సమీపంలో వెళ్లి విషపు గుళికలు మింగాడు. ఈ విషయం తన అన్న అంజనేయులకు తెలపగా ఆయన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లాడు. అక్కులప్పను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జంప్‌రోప్‌లో పాల్గొన్న విద్యార్థికి స్వాగతం

నల్లమాడ, ఆగస్టు 2: జపాన్‌లో గత నెల 22 నుంచి 28 వరకు జరిగిన అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీల్లో స్థానిక పాతబాలాజీ విద్యార్థి తాహేర్ పాల్గొని ప్రతిభ చాటాడు. అనంతరం స్వగ్రామానికి శుక్రవారం తిరిగి వచ్చిన తాహేక్‌కు కరస్పాండెంట్ పోలే స్వర్ణలత, డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. దేశం తరపున తమ పాఠశాల విద్యార్థి ఆడడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, జిల్లా జంప్‌రోప్ కార్యదర్శి నరసింహనాయక్, కోచ్ ఫఠాన్ హనీఫ్, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తాహేర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

హామీలను నెరవేర్చేలా చూడండి



ఎంపీతో ధర్మవరం ముస్లింలు

ధర్మవరం, ఆగస్టు 2 : ఎన్నికలలో ముస్లింలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలని ధర్మవరానికి చెందిన సత్యసాయి జిల్లా ముస్లింమైనార్టీ డెవలప్‌మెంట్ అసోషియేషన్ సభ్యులు ఎంపీ బీకే పార్థసారధిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రోషన్ జమీర్, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు దాదాపీర్, సభ్యులు అనంతపురంలో తన స్వగృహంలో ఎంపీ బీకే పార్థసారధిని కలిసి విన్నవించారు.స్పందించిన ఎంపీ ముస్లింల సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

ధర్మవరం, ఆగస్టు 2 : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి పింగళి వెంకయ్య జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కుళ్లాయరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, ఆగస్టు 2 : విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసిన ఆయన మాట్లాడారు. మారుతున్న కాలనీకి అనుగుణంగా విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా తీర్చిదిద్దాలని, అప్పుడే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నారాలోకేష్ అనేక విద్యా ప్రణాళికలతో మార్పులు తీసుకు వస్తున్నారన్నారు. వివిధ పథకాలకు జగన్ తన పేరు పెట్టుకుంటే, కూటమి ప్రభుత్వంలో విద్య కోసం కృషి చేసిన మహనీయుల పేర్లను లోకేష్ పెట్టడం హర్షణీయమన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం, ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి ఉన్నారు.

చెట్ల పెంపకం సామాజిక బాధ్యత : చెట్ల పెంపకం సామాజిక బాధ్యతగా గురించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కాళసముద్రం గురుకుల పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పర్యవేక్షించండి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 2 : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించకుండా తరచు పారిశుధ్య పనులను పరివేక్షించాలని గ్రామస్థాయి అధికారులకు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యద ర్శులతో కలసి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశావ ర్కర్లతో కలసి ఇంటింటికి వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించేలాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఈఓఆర్డీ ఆశోక్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

మొహరం ఉత్సవాలకు విరాళం

నంబులపూలకుంట : మండలంలోని మరికొమ్మదిన్నె మొహరం ఉత్సవాల నిర్వహణకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ రూ. 15000లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలఅధ్యక్షుడు రామ మోహన్, చాంద్‌బాషా, కేవీ రమణ, విశ్వనాథ్, బాలాజీ పాల్గొన్నారు.

రేపు బోనాల మహోత్సవం

ధర్మవరం : స్థానిక కొత్తపేటలోని టీచర్స్ కాలనీలోని చౌడేశ్వరి దేవీ జయంతి, బోనాల మహోత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్ర వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ఆలయం నుంచి అమ్మవారి పల్లకీలో కొత్తపేటలో ఉన్న అంకాలమ్మ ఆలయం వరకూ మేళతాళాలు.. బోనాలతో ఊరేగిస్తామ న్నారు. అమ్మవారిని దర్శించి అనంతరం అక్కడి నుంచి తిరిగి చౌడేశ్వరిదేవి అమ్మవారికి బోనాలు సమర్పిస్తామ న్నారు. కావున భక్తులు ఆదివారం ఉదయం 8-30 గంటల కే బోనాలతో గుడి వద్దకు చేరుకోవాలని సూచించారు.

రేపు వైద్యశిబిరం

ధర్మవరం, ఆగస్టు 2 : స్థానిక మాధవనగర్‌లోని సత్యసాయి భజన మందిరంలో ఆదివారం రక్తనాళాల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ వాస్క్యులర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

కాణిపాకంలో ఎమ్మెల్యే పల్లె సింధూర పూజలు

పుట్టపర్తి, ఆగస్టు 2 : స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తన జన్మదిన వేడుకలను చిత్తూరులోని కాణిపాకంలో శుక్రవారం జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధి వినాయకుని ఆలయానికి చేరుకున్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా పురోగతి సాధించాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆమె వెంట మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పల్లె వెంకటక్రిష్ణకిశోర్‌రెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకరరెడ్డి దంపతులు ఉన్నారు. అనంతరం వారు తిరుమలకు వెళ్లారు.

వెంగళమ్మచెరువులో... : స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వెంగళమ్మచెరువులో శుక్రవారం రాత్రి నాయకులు కార్యకర్తలు అభిమానులు టీడీపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పేరిట స్థానిక రామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి, కృష్ణకుమార్, రమేష్, పచ్చా మల్లికార్జున, సతీష్‌బాబు, ఈడిగ నారప్ప, సన్నాయప్ప, పాపన్న, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని హనుమాన్ కూడలిలో ఎమ్మెల్యే పేరిట భారీ కేక్‌కట్ చేసి పల్లె సింధూరారెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్‌లక్ష్మణులు సామకోటి ఆదినారాయణ, కోనంకి గంగాధర్, శ్రీరాములు, బేకరి నాయుడు, పుట్లగంగాధర్, బీవీ ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు. అలాగే ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్లలో, ఓడీసీ, నల్లమాడ, ముదిగుబ్బలోని ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో, బుక్కపట్నం, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించారు.




కాణిపాకం ఆలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది, వెంగళమ్మ చెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

గ్రామాలకు పూర్వ వైభవమే ఏపీఎఫ్ ధ్యేయం



పంటలను పరిశీలిస్తున్న ఏపీఎఫ్ ప్రతినిధి అన్వర్

తనకల్లు, ఆగస్టు 2: బీడు భూములు సాగులోకి తెచ్చి.. గ్రామాల పూర్వ వైభవం తేవడమే ఏపీఎఫ్ (అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్) ధ్యేయమని ఆ సంస్థ ప్రతినిధి ఎస్‌కె అన్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపల్లి, గొల్లపల్లి, మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి గ్రామాల్లో జనజాగృతి ఆధ్వర్యంలో రైతులు బీడు భూముల్లో సాగు చేసిన నవధాన్యాలు, చిరుధాన్యాల పంటలను పరిశీలించారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించకుండా రైతులు ఘన, ద్రవజీవామృతాలు, కషాయాలతో పంటలు సాగుచేసి పండిస్తున్న మిరప, బంతిపూవ్వులు, టమాట తదితర పంటలను పరిశీలించారు. ఏపీఎఫ్ సహకారంతో మండలంలోని చీకటిమానుపల్లి, తవళం, గేమేనాయక్‌తండా, మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎంపిక చేసిన 19 పల్లెల్లో వచ్చే నాలుగు సంవత్సరాల పాటు ఈ కార్యక్రమాల ద్వారా సుస్థిరత సాధించడంతోపాటు గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో కార్యక్రమాలు విజయవంతం కావడానికి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది చిత్తశుద్ధి కలిగి ఉండాలన్నారు. త ద్వారా రైతుల్లో ప్రకృతి వ్యవసాయం, నీటిని పెంచుకోవడం, పంచుకోవడం, రక్షక తడులు ఇవ్వడం, సహజ వనరుల సంరక్షణ తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించే అవకాశముందన్నారు. ఈకార్యక్రమంలో వాసన్ సంస్థకు చెందిన చంద్రశేఖర్, జనజాగృతి వ్యవస్థాపకులు బలరాం, వాటర్ ప్రాజెక్టు టీమ్ లీడర్ రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తశుద్ధితోనే విధుల్లో గుర్తింపు: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 2 : పోలీసులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించినప్పుడే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం డీపీఓ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అధికారుల ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడారు. పోలీసుగా విధులు చేపట్టిననాటి నుంచి బాధ్యతాయుతంగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తే ప్రజలకు జీవితాంతం గుర్తుంచుకుంటారన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు అందించే సేవలే శాశ్వతమని, ప్రజలకు సేవలందించే అవకాశం వచ్చినపుడు దాన్ని సద్వినియోగం చేసుకున్న వారే ధన్యులని ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఏఎస్ఐలు సుంకన్న, నీలకంఠ, ఏఎస్ఐ నరసింహులును సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్‌డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, ఆర్ఐ చంద్రశేఖర్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ రత్న

ఎస్సీ వర్గీకరణపై హర్షం

నల్లచెరువు, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాన నరేంద్రమోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞత లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తిరుపాల్, శ్రీరాములు, ఆది, నరసింహులు, గంగాద్రి, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : ఎస్సీ వర్గీకవరణపై సుప్రీం తీర్పుపై స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై 2000 సంవత్సరంలోనే నాటి సీఎం చంద్రబాబునాయడు ఎస్సీలలోని అన్ని ఉప కులాలకు లబ్ధి చేకూరాలని రిజర్వేషన్ వర్గీకరించి అమలు చేశారని తెలిపారు. ఇప్పుడు సుప్రీం కోర్టు కూడా ఎస్సీ వర్గీకరణ తీర్పు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బీదాల నారాయణస్వామి, చంద్రశేఖర్, రామక్రిష్ణ, మల్లికార్జున, పెద్దన్న, నరసింహులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు నివ్వడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ఆనందాన్ని వెలిబుచ్చారు. శుక్రవారం దళిత కాలనీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద ఓబులేశు, నాగభూషణం, పాపోడు, శీనప్ప, నాగ రాజు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ పై జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి జయరామాంజినేయులు హర్షం వ్యక్తం చేశారు.

ముదిగుబ్బ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మండలంలోని టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, దళిత సంఘాల నాయకులు దొరిగల్లు రామాంజి, ఉప్పలపాడు ఆది, రంగనాయకులు, శ్రీనివాసులు, అశోక్, రాజా, ఆదెప్ప, చిన్నకోట్ల నారాయణ, టీడీపీ నాయకులు బాలకృష్ణ, వెంకటపతి పాల్గొన్నారు.

బుక్కపట్నం : ఎస్సీ వర్గీకరణకు అనుకూలం సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో మాజీ సర్పంచ్ యశోదరాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనే యులు, ఆంజనమూర్తి, వీఆర్ఓ మునెప్ప, నాయకులు మంజునాథ్, అశోక్, గంగప్ప, సంజీవ్, పెద్దన్న, గురుప్రసాద్, ఫణీ, కల్యాణ్; రమేష్; సూరి, నారాయణస్వామి పాల్గొన్నారు.

రహదారి మధ్యలో మురుగు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 2: స్థానిక బీసీ దిగువకాలనీలో రహదారి మధ్యలో ఇలా మురుగు నీరు వెళ్తోంది. దీంతో ఆ రహదారిలో వాహనాలు వెళ్లడం అటుంచి... నడుచుకుంటూ వెళ్లడం కూడా కష్టంగా మారింది. రాత్రి సమయంలో వృద్ధులు, చిన్నారులు, మహిళలు జారిపడి గాయాల పాలవుతున్నారు. ఈ మురుగు కాలువ వల్ల దోమలు కూడా విపరీతంగా పెరిగి.. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

ఓడీసీ బీసీ కాలనీలో రహదారి మధ్యలో ఉన్న మురుగుకాలువ →



వైద్యశిబిరం పరిశీలన

నల్లచెరువు, ఆగస్టు 2: మండలంలోని రాజంవాండ్లపల్లి తండాలో అధిక సంఖ్యలో జ్వరాల బారిన పడిన వారికి వైద్య చికిత్సల నిమిత్తం ఏర్పాటు చేసిన శిబిరాన్ని మలేరియా అధికారి కుళ్లాయప్పనాయక్ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం గ్రామంలో జ్వరాల బారిన బారిన పడిన వారి వివరాలపై వైద్యాధికారి కల్పన వద్ద ఆరా తీశారు. నీటి పరీక్షలను, పరిసరాల పరిశుభ్రత ఆయన పరిశీలించారు. మలేరియా పాజిటీవ్ కేసుకు ఇచ్చిన చికిత్సలను తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఎంఓ లక్ష్మీనాయక్, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు రామాంజనేయులు, బాషా, సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, హెల్త్ అసిస్టెంట్లు నారాయణ, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మున్నా, ఆశకార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయసాగు పరిశీలన

ఓబుళదేవరచెరువు : మండలంలోని బత్తినపల్లిలో రైతు శ్రీనివాసుల పొలంలో ప్రకృతి పద్ధతిలో సాగు చేసిన ఎగ్రేడ్ నమూనా ఏడు రకాల కూరగాయాలు, మొక్కజొన్న, సజ్జ పంటలను జిల్లా వనురుల కేంద్రం ఏడీఏ జే సనావుల్లా, ఏఓ ఎస్. ఇలియాజ్ అహమ్మద్ శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుత సమాజం లో ప్రకృతి వ్యవసాయ సాగు ఆరోగ్యానికి రక్ష ణ కవచంలాంటిందని పేర్కొన్నారు. ఏగ్రేడ్ నమూనా పద్ధతి ద్వారా పంటలు పండించాలన్నారు. అనంతరం రైతు అక్కులప్ప సాగుచేసి ఏటీఎం నమూనా వేరుశనగను, ఎనిమిది రకాల కూరగా యాలను పరిశీలిం చారు. ప్రకృతి వ్యవసాయం వలన పురుగుమందులు, రసాయనిక ఎరువుల వాడకం చాలా వరకు తగ్గించవచ్చన్నారు. కావున రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భరత్, ఆత్మ ఎటీఎం మౌనిక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుట్టపర్తి-చెన్నై బస్సు రద్దుతో ఇబ్బందులు

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 2: పుట్టపర్తి - చెన్నై మధ్య అనేక సంవత్సరాలుగా నడుస్తున్న బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు 15 రోజుల క్రితం అర్ధాంతరంగా రద్దు చేశారు. దీంతో పుట్టపర్తి నుంచి చెన్నైకి వెళ్లే ప్రయాణీకులు, విద్యార్థులు, సత్యసాయిబాబా భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ మండలాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు చెన్నై పరిసర ప్రాంతాల్లో అనేక కళాశాలలో చదువుకుంటున్నారు. ఈ బస్సు సర్వీసును నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుట్టపర్తి డిపో ఏర్పడిక ముందు నుంచి ఈ బస్సు సర్వీసు ఉందని, ఇప్పుడు ఎందుకు రద్దు చేశారని ప్రయాణీకులు మండిపడుతున్నారు. కొందరు ప్రైవేటు ట్రావెల్స్ యజమానులకు తలొగ్గి ఈ బస్సును రద్దు చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి పుట్టపర్తి, చెన్నై బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. దీనిపై పుట్టపర్తి డిపో డీఎం ఇయతుల్లాను వివరణ కోరగా... పుట్టపర్తి, చెన్నై బస్సు సర్వీసుకు ప్రయాణీకులు రద్దీ లేకపోవడంతో ఆక్యుపెన్సీ తగ్గడంతో ఈ బస్సును రద్దు చేశామన్నారు. ధర్మవరం నుంచి చెన్నై బస్సు సర్వీసు నడుస్తోందన్నారు.

గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

బత్తలపల్లి, ఆగస్టు 2: మండలంలోని పాడి రైతులు గోకులాలు కావలసిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏడీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హమీ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్మించే గోకులాలు బత్తలపల్లి మండలానికి 45 మంజూరైనట్లు తెలిపారు. 23 ఎస్సీ, ఎస్టీలకు, 22 ఓబీసీ, జనరల్ కేటాయించారన్నారు. పశువులు, గొర్రెలు, కోళ్ల సంఖ్య ఆధారంగా రూ. 80 వేల నుంచి రూ. 2.30 లక్షల వరకు చెల్లిస్తామన్నారు. అందులో రైతు వాట 10 శాతం చెల్లించాల్సి ఉంటుందని, ఆసక్తి గల రైతులు దరకాస్తు చేసుకోవాలని అన్నారు.

కొత్తచెరువు సీఎస్‌డీటీగా నవీన్‌కుమార్

కొత్తచెరువు, ఆగస్టు 2: మండల సీఎస్‌డీటీగా నవీన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పుట్టపర్తి నుంచి బదిలీపై కొత్తచెరువుకు వచ్చారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని పలు చౌకధాన్యపు దుకాణాలను పరిశీలించారు. డీలర్లు లబ్దిదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోఉన్న డీలర్లు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడైన ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ధర్మవరం, ఆగస్టు 2 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని 280 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంశైలజ, హిందీ పండిట్ వేణుగోపాలాచార్యులు పాల్గొన్నారు.

ఆషాఢ మాస పూజలు

ధర్మవరం, ఆగస్టు 2 : స్థానిక సాలేవీధిలో వెలసిన పెద్దమ్మతల్లికి ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ధర్మవరం రూరల్: మండలంలోని గొట్లూరు మహంకాళమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురష్కరించుకుని విశేష పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా అలంకరణ చేశారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.




ధర్మవరంలో పెద్దమ్మ తల్లి అలంకరణ, గొట్లూరులో శాకంబరిగా మహంకాళమ్మ

కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్య

ధర్మవరంరూరల్, ఆగస్టు 2 : మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన రైతు షబ్బీర్ (35) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. షబ్బీర్ తన గ్రామంలో చికెన్‌షాపు, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 15 రోజుల కిందట తన భార్య దిల్షాద్‌తో గొడవ పడ్డాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన షబ్బీర్ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో శుక్రవారం పురుగులమందు తాగాడు. కొద్ది సేపు అనంతరం గమనించిన కుటుంబసభ్యులు అతన్ని హుటాహుటినా ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. షబ్బీర్‌కు భార్య, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలకు రూ.1.20 లక్షల విరాళం



దాత పోతుల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోరంట్ల, ఆగస్టు 2: మండలంలోని మల్లాపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానద్వారం గేటు ఏర్పాటుకు సమాజ సేవకులు బాలన్నగారిపల్లి పోతుల రామకృష్ణారెడ్డి రూ.1.20లక్షల విరాళం అందజేశారు. పాఠశాల ప్రధాన ద్వారానికి గేటు లేకపోవడంతో ఆవరణంలో అసాంఘిక కార్యకాలాపాలకు అవకాశం ఏర్పడింది. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు దాత ఇనుప గేటు తయారు చేయించారు. ప్రధానోపాధ్యాయులు జయసింహ ఆధ్వర్యంలో రామకృష్ణారెడ్డిని శాలువ, పూలమాలతో సత్కరించి, అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

భూముల అన్యాక్రాంతంపై విచారణ చేపట్టండి: సీపీఎం



సదస్సులో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 2: అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములపై సిట్టింగ్ న్యాయాధికారితో విచారణ జరిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో భూ సమస్యలు-ప్రాధాన్యత, వివిధ రాజకీయ పార్టీల వైఖరి అనే అంశంపై ఏర్పాటు చేసిన జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా పేదలకు ఎకరా భూమికూడా పనిచేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రెండెకరాల చొప్పున భూపంపిణీ చేపట్టాలన్నారు. 596జీఓతో అన్యాక్రాంతమైన వేల ఎకరాల భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. భూపోరాటంలో పేదలపై మోపిన కేసులు రద్దుచేసి ఇల్లులేని వారికి ఇళ్లస్థలాలను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, పెద్దన్న, నారాయణ, వెంకటరాముడు, స్వర్ణలత, అచ్చమ్మ, వెంకటలక్ష్మీ, ఆంజనేయులు, గౌతమి పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరీదేవి జయంతి



బోనాల కుండలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు సీసీ హరి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 2 : మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే చౌడేశ్వరీ జయంతి వేడుకలకు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు డీసీ ఈశ్వరయ్య, తొగటవీరక్షత్రియ సంఘం మండల అధ్యక్షుడు సీసీ హరి, ఎగువింటి రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన వారు ఈసారి చౌడేశ్వరీ జయంతి వేడుకలను బోనాలతో జరుపుకుంటున్నామన్నారు. ఆదివారం ఉదయం 8గంటలకు పెద్దమ్మ దేవాలయం నుంచి అమ్మవారి బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, హోమాలు, పూజలు, నిర్వహించి మహామంగళహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థినుల కోరిక మేరకు బోనాలు కుండలను సీసీ హరి అందజేశారు. ఈ కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘం సభ్యులు, గట్టా మహేంద్ర, రంగన గోపాల్, హేమంత్ పాల్గొన్నారు.

నేవీ విభాగానికి కేడెట్‌ల ఎంపిక



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న హెచ్ఎం మురళీధర్‌బాబు

హిందూపురం(పరిగి), ఆగస్టు 2 : కొడిగెనహళ్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల ప్రతిభాపాఠశాలలో శుక్రవారం నేవీ విభాగానికి కెడెట్‌లను ఎంపిక చేశారు. 10ఏ నెల్లూరు బెటాలియన్ నుంచి వచ్చిన బాదల్‌పాండ కేడెట్లను ఎంపిక చేసి, భవిష్యత్తులో క్రమశిక్షణ కలిగిన ఉత్తమ పౌరుల్లా ఎదగాలని ప్రధానోపాధ్యాయులు మురళీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయులు ఎన్‌సీసీ నేవీ అధికారి నాగమోహన్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లోనూ పింఛన్ అందజేత

గోరంట్ల, ఆగస్టు 2: పింఛన్ల పంపిణీ సందర్భంగా రెండోరోజు శుక్రవారం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు, నడవలేని వారికి అందజేశారు. మండలంలోని 20 పంచాయతీల పరిధిలో 11,535 మందికిగాను 11,426 మందికి పింఛన్లు పంపిణీ చేసి చేసినట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి సచివాలయ సిబ్బంది కర్ణాటక, తదితర ప్రాంతాల్లో అనారోగ్యంతో ఆసుపత్రులో ఉన్నవారికి అక్కడికే వెళ్లి అందించారన్నారు. బాలన్నగారిపల్లికి చెందిన సులోచనమ్మ, అనారోగ్యంతో కర్ణాటకలోని బాగేపల్లిలో ఉండగా, కార్యదర్శి ప్రకాష్ వెళ్లి పింఛన్ అందించారు. మందపల్లికి చెందిన ఇస్మాయిల్ ఆపరేషన్ చేయించుకుని హిందూపురంలో ఉండగా, వెల్ఫేర్ అసిస్టెంట్ రఘునాథ్‌నాయక్ పింఛన్ అందించారు. సచివాలయ సిబ్బందికి టీడీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.



ఇస్మాయిల్‌కు పింఛన్ అందిస్తున్న రఘునాథ్‌నాయక్

హామీ ఇచ్చారంటే అమలు చేస్తారు

● మడకశిరకు వరాలజల్లు కురిపించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల

మడకశిరటౌన్, ఆగస్టు 2: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మడకశిర నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారని, చంద్రబాబు హామీ ఇచ్చారంటే వాటిని గ్యారెంటీగా అమలు చేస్తారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా నియోజకవర్గంలో పర్యటించలేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజురై దాదాపు 80 శాతానికి పైగా పనులు పూర్తి అయినా గురుకుల పాఠశాల, కళాశాల భవన నిర్మాణాలను పూర్తి చేయలేకపోయిన అసమర్థ ప్రభుత్వం వైసీపీదేనన్నారు. సీఎం చంద్రబాబునాయుడు హామీ మేరకు హెచ్‌వీడీఎస్ పథకం కింద 500 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తామన్నారు. రింగ్‌రోడ్డు నిర్మాణం చేపడుతామని, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని, హంద్రీనీవా కాలువద్వారా నీరు అందిస్తామని నాడు చంద్రబాబు మాట ఇచ్చారన్నారు. ఇచ్చినమాట ప్రకారం అన్ని హామీలను అమలు చేసి నిర్మాణాన్ని 70 నుంచి 80 శాతానికిపైగా పూర్తి చేశారని, అయినా గత ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేలేదని విమర్శించారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా 1500 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు, అవసరమైతే మరో వెయ్యి ఎకరాలు సేకరించి ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, హంద్రీనీవా కాలువ వెడల్పు బైపాస్ కెనాల్ ద్వారా కృష్ణాజలాలు మడకశిర చెరువులకు నింపడం, సోలార్‌ప్రాజెక్టు, నేషనల్ హైవే అనుసంధానం, వక్కమార్కెట్ ఏర్పాటు ఇలా అనేక హామీలు ఇచ్చారని, వీటన్నింటినీ ఆయన తప్పక నెరవేరుస్తారన్నారు. కొంత మంది పోలీసు అధికారుల వల్ల కొన్ని చిన్న చిన్న పొరపాట్లు జరిగాని, మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్త పడుతామన్నారు. టీడీపీపై బురద జల్లడమే జగన్ పత్రిక పనిగా పెట్టుకుందన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, కౌన్సిలర్ నరసింహరాజు, ఉమాశంకర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు నాగరాజు, మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

లేపాక్షి, ఆగస్టు 2 : గొంగటిపల్లి ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తాదులు పాల్గొన్నారు.



అలంకరణలో ముత్యాలమ్మ

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని ఆటోనగర్ భగీరథీ కాలనీలో వెలసిన మధుగిరి మారెమ్మకు భక్తులు జ్యోతులు సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి, బీజేపీ నాయకులు మూర్తి, చౌడప్ప, ప్రసాద్, శివప్ప, ఆంజనేయులు, వినయ్ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

● వారోత్సవాల్లో ప్రాముఖ్యతను చాటిచెప్పిన వైద్యులు



ఎర్రయ్యగారిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గోరంట్ల, ఆగస్టు 2: తల్లిపాలు అమృతం లాంటివని, పుట్టిన వెంటనే బిడ్డలకు పాలివ్వడం ఆరోగ్యకరమని వైద్యులు సూచించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో ర్యాలీలు చేపట్టారు. మండలంలోని ఎర్రయ్యగారిపల్లి తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేశారు. అనంతరం సూపర్ వైజర్ రజిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూడనమ్మకాలు వీడనాడి ముర్రుపాలు తాగించాలన్నారు. వాటితో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ చామపట్ల మణి, టీడీపీ నాయకులు పచ్చా అశోక్, కార్యదర్శి యశోద, అంగన్‌వాడీ కార్యకర్తలు నంజమ్మ, బయమ్మ, లక్ష్మీ, భార్గవి, ఏఎన్ఎం మలేశ్వరీ తదితరులున్నారు.
పెనుకొండ రూరల్ : తల్లిపాలే బిడ్డకుశ్రీరామరక్ష అని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. పెనుకొండ నగర పంచాయతీలోని కోనాపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యర్రమ్మ, మహిళా పోలీస్ రిహానా, కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.
పెనుకొండ : బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని డాక్టర్. శాంతలక్ష్మి సూచించారు. స్థానిక జీపీ కాలనీ, వజ్రాలపేటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యకర్తలు నాగజ్యోతి, తిమ్మక్క, గాయత్రి, లావణ్య పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు అరికట్టండి: సీఐటీయూ

పెనుకొండ, ఆగస్టు 2: కార్మికులపై రాజకీయ వేధింపులు, ఉద్యోగాల నుంచి అక్రమ తొలగింపులు నివారించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన వర్కర్లపై వేధింపులను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 5న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దధర్నా చేపడుతున్నామన్నారు. ఓడీసీ మండలం వీరప్పగానిపల్లిలో నాగమణి అనే అంగన్‌వాడీ కార్యకర్తపై అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు రాజకీయ వేధింపుల కారణంగా విషం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మండల కోఆర్డినేటర్ బాబావలి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బావమ్మ, మామున్నిసా, సావిత్రమ్మ, లక్ష్మీదేవి, సరస్వతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమేష్

సుప్రీంతీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

మడకశిర టౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు నివ్వడంపై పలు ప్రాంతాల్లో సంబరాలు జరుకున్నారు. రాజ్యాంగం సామాజిక న్యాయానికి దిక్సూచి అని, ఏబీసీడీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలమైన తీర్పు ఇవ్వడం సంతోషించదగ్గ విషయం అని మడకశిర నియోజకవర్గం మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు రాష్ట్ర ఎంఈఎఫ్ కార్యదర్శి భూతన్న, సంఘం నాయకులు వీఎన్ మాలింగప్ప, రంగనాథ్ పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై సంబరాలు జరుపుకున్నారు. ఈశ్వర్, తాహీర్‌వలి, లక్ష్మీనారాయణ, కదురన్న, మద్దిలేటి, సురేష్, నంజప్ప, నిజలింగప్ప, గోవిందప్ప, శివయ్య, రంగయ్య పాల్గొన్నారు. విజయోత్సవ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యేలు మద్దనకుంట ఈరన్న, కె.సుధాకర్, డీహెచ్‌పీఎస్ అధ్యక్షులు ఎం.ఆర్.హనుమంతు, టీడీపీ నాయకులు సునీల్‌కుమార్, జడ్పీటీసీ సభ్యులు భూతరాజు, బీహెచ్ రాయుడు, న్యాయవాది అశ్వత్థ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల హర్షం

హిందూపురం(సోమందేపల్లి) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్‌లో మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కిష్టప్ప, సూర్యనారాయణ, వెంకటేశులు, ఈశ్వర్, చల్లాపల్లి హనుమంతు, కదిరప్ప, ఏబీ ఆంజనేయులు, గంగారాం, నాగరాజు, సజ్జరాయుడు, నరసింహులు, చాలకూరు, హనుమంతు పాల్గొన్నారు.



మడకశిరలో సంబరాలు జరుపుకొంటున్న సంఘం నాయకులు

రొళ్ల : సుప్రీం కోర్టు తీర్పుతో 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ కల నెరవేరిందని దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించిన రాజకీయ నాయకులకు, కులసంఘాలకు ఉద్యోగస్తులకు న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. రంగనపల్లిరాయుడు, ఆలుపనపల్లి శ్రీనివాస్, మల్లినమడుగు జగన్నాథ్, ఆంజనేయులు, పిల్లిగుండ్ల రాజు, తిప్పేహనుమప్ప, రత్నగిరి ఓబుళనరసింహప్ప, వి.ఎస్.పాళ్యం గోవిందప్ప, మధు, కృష్ణమూర్తి, హనిసేకుంట గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

తండాలో తాగునీటి సమస్య

మడకశిర రూరల్, ఆగస్టు 2: మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీ టీడీ పల్లి తండాలో రెండు నెలలుగా తాగునీరులేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. తండాలో తాగునీటి బోరు చెడిపోయి రెండు నెలలైనా ఎవ్వరూ పట్టించుకోలేదని వారు వాపోయారు. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతంలో ఉన్న టీడీ పల్లి బీసీ కాలనీ దగ్గరకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నట్లు వారు తెలిపారు. తండాలో శ్రీరామిరెడ్డి తాగునీటి ట్యాంక్ నిర్మించారు నీరు మాత్రం రావడం లేదు ఇప్పటికైన సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోని తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా తాగునీటి ట్యాంకు

తగిన చర్యలు తీసుకుంటాం:

మహేంద్ర, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మడకశిర

టీడీ పల్లి తండాలో తాగునీటి సమస్య ఉందని ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. గ్రామంలో చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించి నీరందేలా చూస్తాం.

ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్రగాయాలు

పావగడ, ఆగస్టు 2: ఎలుగుబంటి దాడిలో రైతు తీవ్రంగా గాయపడ్డారు. పొలాన్ని కాపుకాసేందుకు వెళ్లే సమయంలో ఎలుగుబంటి దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం ఉదయం 6గంటల సమయంలో పెమ్మనహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. రైతు సంజీవప్ప తన తోటలో సాగుచేసిన రాగిపంటను పరిశీలించేందుకు పొలం వెళ్లాడు. గుట్టల మధ్య వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా గుట్ట చాటు నుంచి వచ్చిన ఎలుగుబంటి దాడిచేసి తలకు, వెన్నెముకకు తీవ్ర గాయపరిచింది. పక్కనే ఉన్న రైతులను గట్టిగా కేకలు వేయడంతో వారు సమయానికి స్పందించి రైతును కాపాడారు. సంజీవప్పను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు అర్సిగెర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు తెలిపారు.



ఆసుపత్రిలో రైతుకు చికిత్స అందిస్తున్న వైద్యులు

బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం



అక్రం(ఫైల్)

పెనుకొండరూరల్, ఆగస్టు 2: మండలంలోని అమ్మవారిపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం బస్సు ఢీకొన్న ప్రమాదంలో అక్రం(15)అనే యువకుడు మృతి చెందాడు. కియా పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్‌జిల్లా అక్రోల్తర్ గ్రామానికి చెందిన అక్రం చిన్నాన్న సాహిల్‌తో కలిసి గురువారం పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమవద్దకు వచ్చారు. సాహిల్ వంట మనిషి కావడంతో హోటల్ నిర్వహించేందుకు చుట్టు పక్కల ఖాళీ ప్రదేశాలను వెతుకుతున్నాడు. సాహిల్ శుక్రవారం ఉదయం కంచెర్ల హోటల్‌వద్ద నుంచి జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న కియా మ్యాన్‌పవర్ బస్సు ఢీ కొని అక్రం అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బంధువు సాహిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అమ్మవారిపల్లి వద్ద జాతీయరహదారి డివైడర్ల మధ్యలో ఏపుగా చెట్లు పెరగడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హైవే అధికారులు డివైడర్ల మధ్య చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

బాలికపై లైంగికదాడి అమానుషం

గోరంట్ల, ఆగస్టు 2: అనంతపురంలోని ఓ ప్రైవేట్ ప్రయివేటు పాఠశాలలో 4వతరగతి విద్యార్థినిపై లైగింకదాడికి పాల్పడడం హేయమైన చర్య అని ప్రగతి శీల విద్యార్థిసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఇలాంటివారిపై ఫోక్సో కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో బాలికలపై దాడి జరగకుండా అడ్డుకోవాలన్నారు.

కానిస్టేబుల్‌పై యువకుల దాడి

గోరంట్ల, ఆగస్టు 2: పట్టణంలోని ప్రధాన రహదారిలో కానిస్టేబుల్‌పై యువకులు దాడికి పాల్పడ్డారు. గురువారం రాత్రి స్థానిక రాజు హోటల్ వద్ద మద్యం సేవించి అల్లరి చేస్తున్న యువకులను కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి మందలించినందుకు వారు తిరగబడి దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సెల్ పాయింట్ నిర్వాహకుడు విజయ్ చంద్ర తన స్నేహితులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకుని పార్టీ చేసుకున్నారు. మద్యం మత్తులో కొద్ది మంది యువత ద్విచక్రవాహనాలకు సైలెన్సర్ తొలగించి నడిరోడ్డుపై అల్లరి చేశారు. సీఎం బందోబస్తుకు వెళ్లిన కానిస్టేబుల్ వేణుగోపాల్ మఫ్టీలో అక్కడికి చేరుకున్నారు. వారిని మందలించే ప్రయత్నం చేయగా, ఒక యువకుడు తిరగబడడంతో కానిస్టేబుల్ అతనిపై చేయి చేసుకున్నారు. దీంతో ఆగ్రహించినయువకులు తాను పోలీసునని చెబుతున్నా వినకుండా కానిస్టేబుల్‌పై దాడి చేశారు. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకుని ఎరుకల వంశీని పట్టుకోగా, మిగిలినవారు పరారైయ్యారు. ఈసంఘటనపై గోరంట్లకు చెందిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు క్రీడాపోటీలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 2: పట్టణ పరిధిలోని విద్యారణ్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ హిందూపురం శాఖలో ఈ నెల 4 న అనంత, సత్యసాయి జిల్లాల వ్యాప్తంగా సరస్వతీ విద్యాలయ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యులు సుబ్రహ్మణ్యం తెలిపారు. దాదాపు 400 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. బాల, బాలికలకు అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ పోటీలు ఉంటాయని. విద్యార్థులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించుకోవాలని వారు తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి: ఏఓ

అగళి, ఆగస్టు 2 : గ్రామాలలో రైతులు పంటల సాగును తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయఅధికారి శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఓ మాట్లాడుతూ పంటలు సాగుచేసినప్రతి రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అందుకు సిబ్బంది సహకరించి రైతులకు ఇబ్బంది కలగకుండా ఈ నమోదు చేయించాలని సూచించారు. 2024సంవత్సరం ఖరీఫ్‌లో సాగుచేసిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్లతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, ఎంపీఈఓలు సిబ్బంది పాల్గొన్నారు.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

లేపాక్షి, ఆగస్టు 2 : రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నాగరాజునాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. 5న ఎన్నికల జాబితాను పాఠశాలలోని నోటీసు బోర్డులో అతికించాలన్నారు. అదేరోజు నామినేషన్లు, ఉపసంహరణలు, తీసుకోవాలన్నారు. 8న ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల్లో పాల్గొనేవారు, ఎన్నికల్లో పోటీచేయదలచినవారు పాటించాల్సిన నిబంధనలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

● ఇబ్బందిపడ్డ వాహనదారులు

మడకశిర రూరల్, ఆగస్టు 2: మడకశిర-అమరాపురం ప్రధాన రహదారి కదిరేపల్లి గ్రామం వద్ద రోడ్డుకు అడ్డంగా భారీ చెట్టు కూలిపడింది. దీంతో ఆ మార్గంలో రవాణాకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. కదిరేపల్లి సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టు శుక్రవారం సాయంత్రం వచ్చిన గాలికి ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ సమయంలో ప్రయాణికులు ఎవ్వరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. అమరాపురం నుంచి మడకశిరకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కొంత మంది చొరవ తీసుకుని తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు

రేషన్ పంపిణీ ప్రారంభం

మడకశిర(అమరాపురం), ఆగస్టు 2 : మండలంలోని హేమావతి పరిధిలోని గొల్లమారనపల్లి గ్రామంలో రేషన్ పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. నూతన రేషన్‌షాపును డీలర్ తిరుమలయాదవ్, కె.శివరం పరిధిలోని పేలుబండ గ్రామంలో డీలర్ పాండురంగప్ప నూతన రేషన్‌షాపులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ గణేష్, స్థానిక నాయకులు పంపిణీని ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రేషన్ పంపిణీ చేయాలని వారు పేర్కొన్నారు. టీడీపీ పంచాయతీ అధ్యక్షులు తిప్పజ్జ, మాజీ సర్పంచ్ కుమారస్వామి, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జయకుమార్ పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మడకశిర రూరల్, ఆగస్టు 2: మండలంలోని గుండుమల గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శుక్రవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రాజు, టీడీపీ రాష్ట ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, గుండుమల మాజీ సర్పంచు చంద్రప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.